సాక్షి చిత్తూరు
శనివారం ၊ 22 ၊ మార్చి ၊ 2025



అటవీ చట్టాలపై అవగాహన

అటవీ చట్టాలపై అధికారులకు పూర్తి అవగాహన అవసరమని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డీఎఫ్ఓ వివరించారు. - 8లో



ట్రాక్టర్ బోల్తా..

ట్రాక్టర్ బోల్తా పడి 42 మందికి గాయాలైన సంఘటన ఎస్సార్ పురం మండలంలోని పొదలపల్లి వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శనివారం (సా)	సహర్ ఆదివారం (ఉ)
చిత్తూరు	6-29	4-55
పుంగనూరు	6-31	4-59

న్యూస్‌రీల్

గురుకులాలకు దరఖాస్తు గడువు పెంపు

సదుం : ఉమ్మడి జిల్లాల్లోని ఎంజేపీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ప్రవేశం కోసం దరఖాస్తు గడువును పెంపొందించినట్లు శుక్రవారం గురుకులాల కన్వీనర్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. జూనియర్ ఇంటర్, 5వ తరగతిలో ప్రవేశానికి, 6, 7, 8, 9 తరగతులలో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి ఈనెల 25 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఏప్రిల్ 4న ఇంటర్ , 27న 5వ తరగతి, 28న 6,7,8,9 తరగతులలో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. సదుం, సత్యవేడు, తంబళ్లపల్లె, ఐతేపల్లె, కుప్పం, కలికిరి, పీలేరు, ఉదయమాణిక్యం, పెద్దపంజాణి, పులిచర్లలోని ఎంజేపీ పాఠశాలల్లో ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. ప్రవేశ పరీక్ష ఫలితాల ఆధారంగా సీట్లను భర్తీ చేస్తామని వెల్లడించారు.

మెడికల్ దుకాణాలపై విజిలెన్స్ దాడులు



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరలోని పలు మెడికల్ దుకాణాలపై పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఆపరేషన్ గరుడలో భాగంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజినల్ అధికారి కరీముల్లా, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కీర్తన, పోలీసు అధికారులు మహేశ్వర్, అనిల్‌కుమార్ బృందాలుగా కలిసి దాడులు నిర్వహించారు. వైద్యుడి సిఫార్సు లేకుండా కొన్ని మందులు ఇవ్వడం, బిల్లులు ఇవ్వకుండా విక్రయాలు చేస్తున్న కొంగారెడ్డిపల్లె అపోలో, మురకంబట్టు మెడ్‌లైఫ్ దుకాణాల లైసెన్సుల రద్దుకు ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు తెలిపారు.

నిధుల దుర్వినియోగంపై కార్యదర్శి సస్పెన్షన్

చిత్తూరు కలెక్టరేట్ : పంచాయతీ నిధుల దుర్వినియోగంపై బంగారుపాళ్యం మండలం గుండ్లకట్టమంచి పంచాయతీ కార్యదర్శి ఉమాపతిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. బంగారుపాళ్యం మండలం గుండ్లకట్టమంచి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న సమయంలో పంచాయతీ నిధులు రూ.3,68,441 దుర్వినియోగానికి పాల్పడ్డారు. ఆ నిధుల పై సమగ్ర విచారణ చేసిన అనంతరం ఉమాపతిని సస్పెండ్ చేశారు. దుర్వినియోగం అయిన నిధులను రికవరీ చేయాల్సిందిగా తహసీల్దార్‌ను ఆదేశిస్తున్నట్లు కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సర్పంచ్‌కు షోకాజ్ జారీ

చిత్తూరు కార్పొరేషన్ : నిధులు దుర్వినియోగం చేసిన కారణంగా బంగారుపాళ్యం మండలం గుండ్లకట్టమంచి పంచాయతీ సర్పంచ్ శ్రీనివాసులుకు షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు డీపీఓ సుధాకర్ రావు తెలిపారు. వారం రోజుల లోపు వీటిపై సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 24 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్ : మద్యం తాగి వాహనాలు నడిపిన 24 మందికి రూ.2.40 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి శుక్రవారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు రెండు రోజులుగా వాహనాలు తనిఖీ చేస్తుండగా పలువురు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం 24 మందిపై కేసు నమోదు చేసి, కోర్టుకు తరలించారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.2.40 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

పంటలు ఎండుతున్నాయని కార్యాలయానికి తాళం

– కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌లు ఇవ్వాలని రైతుల నిరసన



ఏఈ కార్యాలయానికి తాళం వేస్తున్న రైతులు

పలమనేరు : పట్టణంలోని గంగవరం మండల ట్రాన్స్‌కో ఏఈ కార్యాలయానికి శుక్రవారం ఆ మండలానికి చెందిన పలువురు రైతులు తాళం వేసి నిరసన తెలిపారు. మండలంలో రైతులకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్లు కాలి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల కోసం వస్తుంటే పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీంతో తమ పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్య పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.

ఇంటి దొంగలను ఈశ్వరుడైనా పట్టలేరనే చందంగా.. సాక్ష్యాత్తు జిల్లా పోలీసు కార్యాలయంలో అటాచ్‌మెంట్‌ల పేరుతో ఏళ్లకు తరబడి తిష్టవేసి విధులు నిర్వహిస్తూ.. లంచాలు మరిగిన అవినీతి జలగలను పసిగట్టలేకపోతున్నారు.. ఏళ్లుగా పాతుకుపోయిన కొంత మంది చిన్న స్థాయి ఉద్యోగులు .. ఉన్నతాధికారులనే బెదిరించే స్థాయిలో వీరు వ్యవహారాలు చక్కబెడుతున్నారు. మరోవైపు అసాంఘిక కార్యకలాపాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. వీటిన్నింటిపై జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రక్షాళన జరగాలని కొంత మంది పోలీసులు సైతం కోరుకుంటుండడం విశేషం.

అవినీతి జలగలు!



- జిల్లా పోలీసు కార్యాలయంలో ఫైలుకో రేటు?
- మినిస్టీరియల్ స్టాఫ్ విధులకు.. పీసీల సాయం
- సబ్–డివిజన్ కార్యాలయాల్లోనూ వారిదే హవా
- ఐడీ పార్టీ, ఐడబ్ల్యూ, డ్రైవర్ల డ్యూటీల్లో కదలని వైనం
- చిత్తూరు పోలీసు శాఖలో మరింత ప్రక్షాళన అవసరమే..



చిత్తూరులోని జిల్లా పోలీసు కార్యాలయం

చిత్తూరు అర్బన్ : కూటమి పార్టీకి చెందిన ఎమ్మెల్యే ఖాకీ యూనిఫామ్‌పై చల్లిన బురదను కడుక్కోవడానికి జిల్లాలో ఏక పక్షంగా 264 మంది పోలీసులు బదిలీ అయ్యారు. కాగా వేల మంది పోలీసుల పనులు చేసే జిల్లా పోలీసు కార్యాలయంలో గాడితప్పిన కొందరు మినిస్టీరియల్ సిబ్బందిని దారిలో ఎవరు పెడతారు..? ఇన్‌స్పెక్టర్ల వద్ద డ్రైవర్ డ్యూటీ చేస్తూ ఆర్థిక పనులు చక్కబెడుతున్న వాళ్లకు బదిలీ ఉండదా..? డీఎస్పీల వద్ద తిష్ట వేసిన తిమింగలాల అక్రమాలకు కళ్లెం వేయలేరా..? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

డీపీవోపై పట్టు అవసరం..

వేల మంది పోలీసులు స్టేషన్‌లో.. రోడ్లపై డ్యూటీలు చేయడం కనిపిస్తూనే ఉంటుంది. రూ.వంద లంచం తీసుకున్న వాళ్లను నిర్దాక్షణ్యంగా సస్పెండ్ చేసిన సందర్భాలు చాలానే ఉన్నాయి. కానీ ఆరోగ్యం బాగోలేక మెడికల్ లీవు పెట్టుకున్న కానిస్టేబుల్.. తన పెండింగ్ వేతనం కోసం డీపీవోకు వెళ్లాలి. ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్)పై రుణం తీసుకుంటే తప్ప పిల్లాడి చదువు కొనసాగించలేని వాళ్లు, ఎనిమిదేళ్లకోసారి వచ్చే ఇంక్రిమెంటును సకాలంలో ఇవ్వకపోవడంతో.. దాని బకాయిల కోసం తిరిగే సీనియర్ పోలీసులు, కమిటేషన్ లీవుల కోసం సీటు.. సీటుకు సెల్యూట్ కొట్టి నెలల పాటు తిరిగే హెడ్‌కానిస్టేబుళ్లు.. వీళ్లందరినీ ఒకే చోట చూడాలంటే అది జిల్లా పోలీసు కార్యాలయమే.

అటాచ్‌మెంట్ పేరుతో..

పోలీసుల సంక్షేమ కోసం పనిచేసే డీపీవోలో ఒక్క రూపాయి తీసుకుంటే పాపమని భావించే నిర్ణీత గడువుకన్నా ముందుగా పనులు పూర్తిచేసే మినిస్టీరియల్ సిబ్బంది ఇక్కడ చాలా మందే ఉన్నారు. ఇదే సమయంలో సాటి డిపార్టుమెంటులో పని చేస్తున్న పోలీసులకు సాయం చేయాలన్నా చేతులు చాచే అవినీతి జలగలు కూడా ఇక్కడే కనిపిస్తుంటారు. పరిపాలన కోసం డీపీవోలో ఉన్న మినిస్టీరియల్ ఉద్యోగులు చేయాల్సిన పనులు సకాలంలో చేయకపోవడంతో వారికి తోక సాయంగా స్టేషన్‌లో విధులు నిర్వర్తించే పోలీసులను అటాచ్‌మెంట్ల ద్వారా పిలిపించి విధులు చేయించుకోవడం డీపీవోలో సర్వసాధారణమనే విమర్శలున్నాయి. ఇక సిబ్బంది బదిలీల్లో వందల పేర్ల మధ్యలో తమకు కావాల్సిన వ్యక్తుల ఒకటి, రెండు పేర్లను ఇరికించి కోరుకున్న చోటుకి బదిలీ చేయడం, వాళ్ల నుంచి ఆర్థిక భరోసా పొందుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. వీటన్నింటికీ చెక్ పెట్టాలంటే ముందుగా పోలీసు బాసుకు డీపీవోపై పట్టు అవసరమనే వాదనలు వినిపిస్తున్నాయి.

అసాంఘిక కార్యకలాపాలు పోషిస్తూ..

చిత్తూరు వెస్ట్ పరిధిలో ఐడీ పార్టీ పేరిట ఓ కానిస్టేబుల్ బెట్టింగులను ప్రోత్సహిస్తూ, అసాంఘిక కార్యకలాపాలను తన కనుసన్నల్లో చేయిస్తున్నా అడిగే దిక్కులేదు. ఐడబ్ల్యూ (రైటర్లు) పేరిట పలమనేరు డివిజన్‌లోని ఓ కానిస్టేబుల్ ప్రతి రోజూ సాయంత్రం ఇంటికి వెళ్లేలోపు జేబులో రూ.2 వేలు ఉండాల్సిందే. అయిదేళ్లల్లో మూడు సార్లు ఓ డీఎస్పీ క్యాంపు కార్యాలయాన్నే తన సీటుగా మలుచుకుని సబ్–డివిజన్ మొత్తం షాడో డీఎస్పీగా పేరొందిన వ్యక్తిని, చిత్తూరులో ఓ సీఐ వద్ద పనిచేసే డ్రైవర్ ఫైనాన్స్‌లు ఇస్తూ, సెటిల్‌మెంట్లు చేస్తున్నా ఎవ్వరూ అడగని పరిస్థితి. అసలు ఇన్‌స్పెక్టర్ల వద్ద డ్రైవర్ల రూపంలో ఏళ్ల తరబడి పాతుకుపోయిన వాళ్లను ఎందుకు కదిలించడంలేదని ప్రశ్నిస్తున్నారు.

వారికి బదిలీ ఉండదా..?

పుంగనూరులో టీడీపీ కార్యకర్త హత్య ఘటనను కారణంగా చూపిస్తూ జిల్లా పోలీసు శాఖలో జరిగిన బదిలీల పర్వంపై ఖాకీలు రగిలిపోతున్నారు. తమ కడుపుమంట పోసుకున్న కూటమి పార్టీ నేతలకు శాపనార్థాలు పెడుతున్నారు. ఇదే సమయంలో బాసు తీసుకునే నిర్ణయాల వల్ల కలిగే తప్పొప్పులను చెప్పలేకపోతున్న 'ప్రత్యేక విభాగం' వాస్తవాలను చెప్పకుండా మౌనం వహించడంపై గుర్రుమంటున్నారు.

దౌర్జన్యంగా నిర్వహించిన వేలంపాటను రద్దు చేయాలి

– మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి డిమాండ్



మాట్లాడుతున్న రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

శ్రీరంగరాజపురం (కార్వేటినగరం) : కూటమి నాయకుల దౌర్జన్యంతో పెనుమూరు షాపింగ్ కాంప్లెక్స్‌కు నిర్వహించిన వేలం పాటను రద్దు చేసి అధికారుల సమక్షంలో బహిరంగ వేలం పాట నిర్వహించాలని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్ద తయ్యూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ.. దౌర్జన్యంతో వేలం పాట నిర్వహించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని విమర్శించారు. కలెక్టర్, ఎస్పీ వెంటనే స్పందించి అర్హులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహాసముద్రం దయాసాగర్ రెడ్డి పది మంది పేదలకు మంచి చేయాలనే ఉద్దేశంతో నూతన వాణిజ్య కాంప్లెక్స్ నిర్మాణాన్ని చేపడితే, నేడు కూటమి నాయకులు షాపింగ్ కాంప్లెక్స్ వేలం పాటకు రాజకీయ రంగు పులిమి తక్కువ ధరలకే పచ్చనేతలకు కట్టబెట్టి ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని ఆరోపించారు. అదే విధంగా 49 కొత్తపల్లి మిట్టలో జరిగే వారపు సంతలో వేలం పాట దక్కించుకున్న వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుడికి అధికారులు సహకరించాలని కోరారు. ఆయన వెంట జిల్లా ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, జనార్దన్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు పోర్ట్‌ఫోలియో జడ్జి సమీక్ష

చిత్తూరు అర్బన్ : చిత్తూరు పోర్ట్ ఫోలియో జడ్జి జస్టిస్ సురేష్‌రెడ్డి శనివారం జిల్లాలోని న్యాయమూర్తులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. చిత్తూరు నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో చిత్తూరు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న న్యాయమూర్తులతో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం వరకు ఈ సమీక్ష జరగనుంది.

జేసీబీ, 5 ట్రాక్టర్లు సీజ్



పోలీసు సిబ్బంది ఇసుక అక్రమ తవ్వకాలపై దాడులు జరిపి జేసీబీ, 5 ట్రాక్టర్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించామన్నారు.

గంగవరం : మండలంలో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేసి తరలిస్తున్న జేసీబీ, 5 ట్రాక్టర్లను గంగవరం పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. సీఐ ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని దండపల్లి గ్రామం వద్ద కొంత మంది కౌండిన్యా నదిలో జేసీబీతో తవ్వకాలు చేసి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా అక్రమ రవాణా చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమాచారం మేరకు

విద్యుత్ బకాయిలపై సర్‌చార్జీల రద్దు

చిత్తూరు కార్పొరేషన్ : ప్రభుత్వశాఖ విద్యుత్ బకాయిలపై సర్‌చార్జ్‌లను రద్దు చేస్తూ ఏపీఈఆర్‌సీ ఉత్తర్వులు జారీ చేసింది. డిసెంబర్ 31 నాటికి విద్యుత్‌శాఖకు చెల్లించాల్సిన బిల్లులను ఏకకాలంలో చెల్లించే వారికి ఈ అవకాశం కల్పించింది. ఏప్రిల్ 17లోపు చెల్లించే వారికి సర్‌చార్జ్ రద్దు వర్తించనుంది. సంబంధితశాఖల హెచ్‌ఓడీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఇస్మాయిల్‌అహ్మద్ కోరారు.

బడుల విలీనంపై ప్రభుత్వం స్పందించాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సోమశేఖరనాయుడు

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖరనాయుడు డిమాండ్ చేశారు. ఆ సంఘం నాయకులు జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ 5వ తేదీన తిరుపతిలో ఐదు జిల్లాల ప్రాంతీయ విద్యా సదస్సు, పోరుబాట సదస్సు జరుగుతుందన్నారు. ప్రభుత్వం తొలి సంతకం చేసిన డీఎస్సీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ మాట్లాడుతూ.. 117 జీవో రద్దు, పాఠశాలల విలీనంపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయుల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. తిరుపతి జిల్లా కేంద్రంలో నిర్వహించే పోరుబాట సదస్సుకు చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి అధిక సంఖ్యలో సంఘం సభ్యులు, టీచర్లు పాల్గొనాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మణిగండన్, నాయకులు సుధాకర్ రెడ్డి, కె.రెడ్డెప్ప నాయుడు, రెహనా బేగం, ఎస్‌పీ బాషా, సరిత, ఏకాంబరం, పార్థసారథి, పంటపల్లి సురేష్, ఈశ్వర్ పాల్గొన్నారు.

లక్ష్యం దిశగా అడుగులు

- జిల్లాలో చురుగ్గా పన్నుల వసూళ్ల ప్రక్రియ
- లక్ష్యం రూ.24.30 కోట్లు.. వసూలు రూ.20.96 కోట్లు
- ఇప్పటికే 86 శాతం పూర్తి
- రాష్ట్రంలో జిల్లా రెండో స్థానం
- గడువు నాటికి వందశాతం పూర్తికి కృషి



వెదురుకుప్పంలో పన్ను వసూళ్లు చేస్తున్న సిబ్బంది

డివిజన్	పంచాయతీలు	పన్నుల లక్ష్యం (రూ.కోట్లలో)	వసూళ్లు (రూ.కోట్లలో)
చిత్తూరు	296	11.77	9.99
నగరి	102	1.79	1.72
పలమనేరు	206	8.99	7.73
కుప్పం	93	1.74	1.52
మొత్తం	697	24.30	20.96

చిత్తూరు కార్పొరేషన్ : పంచాయతీల అభివృద్ధికి.. కార్మికులకు నెలనెలా జీతాలకు పన్నుల వసూళ్లే కీలకం. సకాలంలో పన్ను వసూలు చేస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. మార్చి నెలాఖరులోగా పన్ను వసూలు చేయాలి. గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని జిల్లా, మండల స్థాయి అధికారులు తరచూ ఆదేశాలు జారీ చేస్తుంటారు. వీటిని పక్కాగా అమలు చేయడానికి జిల్లా పంచాయతీ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. గడువు సమయంలో తొందర పడకుండా ముందుస్తుగా దశల వారీగా ఒత్తిడి తెచ్చారు. దీంతో నిర్దేశించిన లక్ష్యంలో గురువారం నాటికే 86 శాతానికి చేరుకున్నారు. మరో పది రోజుల్లో అనుకున్న లక్ష్యానికి చేరుకోవాలని పనిచేస్తున్నారు. పన్నుల వసూళ్లలో రాష్ట్రంలో ప్రస్తుతం చిత్తూరు జిల్లా రెండో స్థానంలో ఉందని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.


జిల్లాలో నవంబర్ నుంచే..

ఏటా పన్నుల వసూళ్లు చేయాలని అధికారులు చెప్పడం క్షేత్రస్థాయి సిబ్బంది సరే అనడం.. తీరా మార్చినెల అయ్యాక ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోవడం సర్వసాధారణంగా మారింది. కానీ వీటిపై ఈసారి అధికారులు రూట్ మార్చారు. చివరి రోజుల్లో పరుగెత్తే బదులు ముందు నుంచి నడుస్తామని పక్కా ప్లాన్ చేసుకున్నారు. నవంబర్ నుంచే రోజూ పన్నుల వసూళ్లు, ఇతర విషయాల మీద సమావేశాలు సిబ్బందితో నిర్వహించారు. వారిని వీటిపై సిద్ధం చేస్తూ పలు సూచనలు చేశారు. స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్‌లో అసెస్‌మెంట్ వివరాలను సిద్ధం చేసుకున్నారు. పంచాయతీ వారీగా ఎంత రావాలి? ఎంత వస్తుంది ?ఎక్కడ ఆలస్యమవుతుంది? అనే విషయాల పై ఎక్కువ ఫోకస్ పెట్టారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు గురించి స్థానికులకు తెలియజేస్తూ పన్నులు చెల్లించాలని గ్రామస్తులకు చెబుతూ వసూళ్లు ప్రారంభించారు. జనవరి నుంచి వీటిని వేగవంతం చేస్తూ వచ్చారు. దీంతో మార్చి 20 నాటికి 86 శాతం నిర్దేశించిన లక్ష్యానికి చేరుకున్నారు. మార్చి 25 నాటికి 90 శాతం నెలాఖరుకు 95 శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని అధికారులు టార్గెట్ పెట్టుకున్నారు. పంచాయతీ ఉద్యోగులు, మండల అధికారులు, డివిజనల్ అధికారులు సమష్టిగా వీటిపై ఫోకస్ పెట్టారు. ప్రతి పంచాయతీలో సెక్రటరీలు, బిల్ కలెక్టర్లు, సచివాలయ ఉద్యోగులు, కాంట్రాక్టు సిబ్బంది అందరికీ పలు ఆదేశాలు అధికారులు ఇచ్చారు. పన్నుల వసూళ్లను బట్టి పనితీరున అర్థం చేసుకోవచ్చు. అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శుల నేతృత్వంలో బిల్ కలెక్టర్లతో పాటు సచివాలయ ఉద్యోగులు ఏ విధంగా పనిచేస్తున్నారో తెలుస్తోంది. ఎంపీడీఓల ప్రత్యేక పర్యవేక్షణ వీటికి తోడు అయింది.

86 శాతం వసూళ్లు

జిల్లా పరిధిలో 697 పంచాయతీలు ఉండగా లక్ష్యంలో 86 శాతం వసూళ్లు రాబట్టారు. చిత్తూరు, నగరి, పలమనేరు, కుప్పం రెవెన్యూ డివిజన్‌లు ఉన్నాయి. పాత బకాయిలు రూ.4.75 కోట్లు కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్ను, పన్నేతరాలు కలిపి రూ.19.55 కోట్లు వసూలు కావాల్సి ఉంది. పాత బకాయిలతో కలిపి ఇప్పటికి రూ.24.30 కోట్లలో రూ.20.96 కోట్లు వసూలు అయింది. ఈనెలాఖరులోగా మిగిలిన రూ.3.34. కోట్ల వసూలు అవ్వాల్సి ఉంది. నగరి డివిజన్‌లో రూ.1.42 కోట్లు, కుప్పంలో రూ.1.42 కోట్లు, చిత్తూరు డివిజన్‌లో రూ.9.79 కోట్లు, పలమనేరు రూ.7.43 కోట్లు వసూళ్లు వచ్చింది. అంటే చిత్తూరు మొదటి స్థానంలో, పలమనేరు, నగరి, కుప్పం తర్వాత స్థానాల్లో ఉన్నాయి. రాష్ట్ర అధికారులు ఫిబ్రవరిలోపు 50 శాతం, మార్చి రెండో వారానికి 75 శాతం, చివరికి 100 శాతం చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు.

ప్రత్యేక చర్యలు



పంచాయతీల అభివృద్ధికి పన్ను బకాయిలు విఘాతం కా కూడదు. ప్రతి ఒక్కరూ మార్చి 31 లోపు పాత బకాయిలు, ప్రస్తుత పన్నులు అందరూ చెల్లించాలి. నవంబరు నుంచి వసూళ్ల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. అప్పటి నుంచి వసూళ్లను ప్రారంభించి జనవరి నుంచి వేగం పెంచాం. వంద శాతం వసూళ్లే లక్ష్యంగా పనిచేయాలి. ప్రతి ఒక్కరూ ఇలాగే పనిచేసి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి కృషి చేయాలి.

–సుధాకర్‌రావు, డీపీఓ, చిత్తూరు జిల్లా

'పది' పరీక్షలకు మోహరించిన అధికారులు



చౌడేపల్లె పరీక్షా కేంద్రంలో సూచనలిస్తున్న స్క్వాడ్ బృందం

సాక్షి ఎఫెక్ట్..

చౌడేపల్లె : స్థానిక ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షా కేంద్రంలో మూడు స్క్వాడ్ బృందాలు శుక్రవారం తనిఖీలు చేపట్టాయి. 'సాక్షి'లో హిందీ పరీక్షలో మాస్ కాపీయింగ్..? అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు పరీక్షా కే ంద్రం వద్ద ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. మూడవ రోజు ఇంగ్లీషు పరీక్షకు హాజరైన విద్యార్థులను ప్రధాన గేటు వద్ద పోలీసులు, సచివాలయ మహిళా సంరక్షకులు పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులను మాత్రమే లోపలికి తనిఖీ చేసి పంపారు. చిత్తూరు నుంచి అడిషనల్ ఫ్లైయింగ్ స్క్వాడ్‌తో పాటు రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్ష కేంద్రం ప్రారంభం నుంచి పరీక్షలు ముగిసే వరకు అక్కడే ఉన్నారు. పరీక్షా కేంద్రం వద్ద అదనపు పోలీసు సిబ్బందిని కేటాయించారు. కాగా మొత్తం 500 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 8 మంది విద్యార్థులు పరీక్షలకు డుమ్మా కొట్టారు. పరీక్షా కేంద్రాన్ని ఎంఈఓ తిరుమలమ్మ, తహసీల్దార్ హనుమంతునాయక్, ఎస్ఐ నాగేశ్వరరావు తనిఖీ చేశారు.

రొంపిచెర్లలో కట్టుదిట్టంగా పరీక్షలు

రొంపిచెర్ల : రొంపిచెర్లలో జరుగుతున్న పదో తగరతి పరీక్షలపై జిల్లా విద్యాశాఖ అధికారులు పట్టు బిగించారు. నాలుగు రోజుల కిందట బాలుర ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన రెండు సీసీ కెమెరాలను గుర్తు తెలియని దొంగలు చోరీ చేశారు. దీంతో శుక్రవారం రొంపిచెర్ల బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షలు పూర్తి అయ్యే వరకు సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశారు. అయితే పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు ఇంత వరకు కనెక్షన్ ఇవ్వలేదని సమాచారం.

పోలీసులకు సేవా పతకాలు



మహబూబ్ బాషా, డీఎస్పీ



మనోహర్, సీఐ



మునిరత్నం, హెడ్ కానిస్టేబుల్



నీమతుల్ల, హెడ్ కానిస్టేబుల్



మణిగండన్, కానిస్టేబుల్

చిత్తూరు అర్బన్ : జిల్లా పోలీసుశాఖలో పని చేస్తున్న 10 మంది పోలీసులకు ఈ ఏడాది ఉగాది సేవా పతకాలను ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు సీసీఎస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న మునిరత్నంకు ఉత్తమ సేవా పతకం , ఆర్మ్‌డ్ రిజర్వు విభాగం డీఎస్పీ మహబూబ్ బాష, స్పెషల్ బ్రాంచ్ సీఐ మనోహర్, ఏఎస్ఐ జి.దేవరాజులునాయుడు (డీసీసీ–చిత్తూరు), హెడ్ కానిస్టేబుళ్లు నీమతుల్ల (డీసీఆర్‌బీ–చిత్తూరు), బాలాజీ (గుడుపల్లె), వెంకటేశ్వర్లు (డీసీఆర్‌బీ–చిత్తూరు), ఎం.సురేష్‌కుమార్ (ఏఆర్–చిత్తూరు)తో పాటు కానిస్టేబుళ్లు పి.హరిబాబు (పంజాణి), ఎల్.మణిగండన్ (ట్రాఫిక్–చిత్తూరు)కు సేవా పతకాలకు ఎంపిక చేసినట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి.

క్లుప్తంగా

జనారణ్యంలోకి దుప్పి



దుప్పిని రక్షిస్తున్న అటవీ సిబ్బంది

చిత్తూరు కార్పొరేషన్ : నగరంలోని పీవీకేఎస్ డిగ్రీ ప్రభుత్వ కళాశాల ప్రాంతంలో దుప్పి కనిపించింది. శుక్రవారం ఉదయం రెడ్డిగుంట అటవీ ప్రాంతం నుంచి బయటకు వచ్చి కళాశాల ప్రాంగణం వైపుగా వచ్చినట్లు తెలుస్తోంది. జనాలను చూసి భయపడటంతో పరుగులు తీస్తూ సమీపంలోని కమ్మీలకు కొమ్ములు చిక్కుకోవడంతో అక్కడ ఇరుక్కుపోయింది. గమనించిన కళాశాల సిబ్బంది అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకొని దుప్పిని రక్షించి పశువైద్యశాలకు తరలించారు. చికిత్స ఇచ్చిన అనంతరం అటవీ ప్రాంతంలో వదిలేసినట్లు ఎఫ్‌బీఓ గౌస్‌బాషా తెలిపారు.

దొంగలు అరెస్టు.. బంగారం స్వాధీనం



నిందితులను కోర్టులో హాజరు పరుస్తున్న పోలీసులు

గడుపల్లె : ఇంట్లోకి చొరబడి బంగారు, వెండి నగలు దొంగలించిన గోపాల్, ఇబ్రహీం నిందితులను గుడుపల్లె ఎస్‌ఐ శ్రీనివాసులు పట్టుకుని నగలను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామన్నారు. గుడుపల్లె మండలంలోని పెద్దశెట్టిపల్లె గ్రామానికి చెందిన వల్లీయమ్మ ఇంట్లో ఈనెల 16వ తేదీన ఇంటి తాళాలు పగలు కొట్టి బీరువాలో ఉన్న బంగారు, వెండి నగలను దొంగలించుకు వెళ్లారన్నారు. దొంగలించిన నగలు అమ్ముకునేందుకు శాంతీపురానికి వెళుతుండగా మార్గమధ్యలో పోలీసులు సమాచారం తెలుసుకుని వెళ్లి పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న బంగారం, వెండి నగలను స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. గత ఏడాది రామకుప్పం మండలంలోని చెల్దిగానిపల్లెలోని ఒక సూపర్ మార్కెట్‌లో రాత్రి సమయంలో షట్టర్లు ఎత్తి దొంగలించిన కేసు కూడా రామకుప్పం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయిందన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడండి

- క్రమం తప్పక ట్యాంకులను శుభ్రం చేయించాలి
- పంట నీటి కుంటలు నిర్మించండి
- పలు శాఖల వరుస సమీక్షల్లో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో వరుస సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ మేరకు కలెక్టర్ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని రక్షిత మంచి నీటి సరఫరాపై ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయించాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను మండల స్పెషల్ ఆఫీసర్లు పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో బహిరంగ మల మూత్ర విసర్జన జరగకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ నెలాఖరు లోపు జిల్లాలోని అన్ని ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. అనంతరం జియోట్యాగింగ్ తో ఫొటోలు సమర్పించాలని కోరారు.

జిల్లాలో 15 రోజుల వ్యవధిలో 308 చేతి పంపులు మరమ్మతులు కాగా 233 రిపేర్లు చేయించినట్లు తెలిపారు. 190 పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి మొత్తం అన్ని పైపులకు మరమ్మతులు చేపట్టామన్నారు. 225 పంపు సెట్‌లు మరమ్మతులను గుర్తించి 221 పంపు సెట్‌లకు మరమ్మతు చేయించినట్లు తెలిపారు.

గృహ నిర్మాణాల పురోగతిలో అలసత్వం వద్దు

జిల్లాలో గృహ నిర్మాణాల పురోగతిలో అలసత్వ వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ హెచ్చరించారు. ఈ మేరకు హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో చేపట్టిన వివిధ దశల్లో ఉన్న 6,568 గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న గృహాలను పూర్తి చేసేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ లకు ప్రభుత్వం అందిస్తున్న అదనపు సహాయంను క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. అదనపు సహాయానికి ఇప్పటి వరకు 16,406 మంది లబ్ధిదారులను గుర్తించడం జరిగిందన్నారు. ఇందులో 6,388 మందికి సంబంధించి రూ.9.20 కోట్లు ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. జిల్లాలోని పూతలపట్టు, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల్లో లే అవుట్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని కుప్పం, పుంగనూరు, పలమనేరు, నగరి నియోజకవర్గాల్లో 175 అంగన్‌వాడీ భవనాలు మంజూరు కాగా రూ.47 లక్షలతో పూర్తి చేసినట్లు తెలిపారు.

జల సంరక్షణకు చర్యలు చేపట్టాలి

జిల్లాలో జల సంరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పెద్ద ఎత్తున నీటి కుంటలను నిర్మించాలన్నారు. జల సంరక్షణ చర్యల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పెద్ద ఎత్తున పంట నీటి కుంటల నిర్మాణాలు చేపట్టాలన్నారు. జూన్ నెలాఖరు లోపు నీటి కుంటల నిర్మాణం చేపట్టేందుకు జిల్లాలో ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. వేసవిలో ఉపాధి కూలీలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కూలీలకు తాగునీటి సౌకర్యం, ఇతర సౌకర్యాలను పకడ్బందీగా చేపట్టాలన్నారు. సమీక్షల్లో జెడ్పీ సీఈవో రవి కుమార్ నాయుడు, డ్వామా పీడీ రవికుమార్, హౌసింగ్ పీడీ గోపాల్‌నాయక్, డీపీవో సుధాకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

పాడి రైతులకు 'హెరిటేజ్' అన్యాయం

- 306 లీటర్ల పాలకు డబ్బులు ఇవ్వని వైనం
- లబోదిబోమంటున్న ఏజెంటు



రెడ్డెప్ప నాయుడు, ఏజెంట్

రొంపిచెర్ల : రైతుల నుంచి సేకరించిన పాలకు డబ్బు సక్రమంగా చెల్లించడం లేదని మండలంలోని చెంచెంరెడ్డి గారిపల్లె పంచాయతీ లంకిపల్లెవారిపల్లెకు చెందిన హెరిటేజ్ ఏజెంట్ రెడ్డెప్ప నాయుడు ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 20 ఏళ్లుగా హెరిటేజ్ ఏజెంటుగా పని చేస్తున్నానని తెలిపారు. అయితే ఈనెల 1, 2, 4, 5వ తేదీలలో పీలేరు హెరిటేజ్ డెయిరీ 306 లీటర్ల పాలు పోసుకుని ఒక రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. నాలుగు రోజుల పాల డబ్బులు రైతులకు తన చేతి నుంచి రూ.10 వేలు ఇచ్చినట్లు చెప్పారు. ఏజెంట్‌గా తనకు ఒక లీటరు పాలకు రూ.90 పైసల నుంచి రూపాయి మాత్రమే ఇస్తారని, అయితే రూ.10 వేలు సొంత సొమ్మును పాలు పోసిన రైతులకు ఇస్తే హెరిటేజ్ డెయిరీ పట్టించుకోకుండా పాడి రైతులకు అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా హెరిటేజ్ అధికారులు స్పందించి 306 లీటర్ల పాల డబ్బును చెల్లించాలని కోరారు.

కార్యదర్శులపై పనిభారం తగ్గించాలి



డీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శుల సంఘం నేతలు

- సహకరించని సచివాలయ ఉద్యోగులు
- డీపీఓకు నాయకులు వినతి

చిత్తూరు కార్పొరేషన్ : పంచాయతీ కార్యదర్శులపై పనిభారం తగ్గించాలని ఏపీ గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా నాయకులు తెలిపారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు శుక్రవారం కలెక్టర్, డీపీఓ కార్యాలయంలో డీపీఓ సుధాకర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. పలురకాల సర్వేలు, కార్యక్రమాలు విజయవంతం కావడంలో కార్యదర్శుల పాత్ర కీలకమైనదన్నారు. ప్రస్తుతం మిస్సింగ్ సిటిజన్, ఎంప్లాయిస్, ఆధార్ సర్వే, వర్క్‌ఫ్రం హోం, హౌస్ హోల్డర్స్, డెత్ రీవెరిఫికేషన్, పీఎసీఎస్, ఎన్‌పీసీఎల్, నాన్ ఏపీ రెసిడెన్స్, విలేజ్ అసెట్, ప్రొఫైల్ సర్వేలు చేస్తున్నామన్నారు. వీటితో పాటు తమ రోజువారి విధులు అయిన ఇంటి , నీటి పన్నులు, లైసెన్స్, లీజ్, వేలం పాట ఇతర పన్నుల వసూళ్లు, పారిశుద్ధ్య నిర్వహణ, వర్మికంపోస్టు పర్యవేక్షణ, వాటర్ ట్యాంకుల క్లోరినేషన్, భూముల సర్వే వంటి పనుల చేస్తున్నామన్నారు. సర్వేలకు సచివాలయ సిబ్బంది సహకారం లేదన్నారు. దీంతో పని ఒత్తిడి కార్యదర్శులపై పడుతోందన్నారు. సచివాలయ సిబ్బంది సర్వే, ఇతర కార్యక్రమాల్లో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గిరి, శివశంకర్, రమేష్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. 42 మందికి గాయాలు



తీవ్రగాయాలతో రోదిస్తున్న మహిళ



ప్రమాదంలో గాయపడిన పండమ్మ

శ్రీరంగరాజపురం (కార్వేటినగరం) : ట్రాక్టర్ బోల్తా పడి 42 మందికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని పాదలపల్లి వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా.. వెదురుకుప్పం మండలం యనమల మంది గ్రామానికి చెందిన నరసింహులు అత్త గంగాధర నెల్లూరు మండలంలోని అరవచేనుపల్లి గ్రామంలో మృతి చెందడంతో అంత్యక్రియలకు స్థానికులతో కలిసి సుమారు 45 మంది ట్రాక్టర్‌లో తరలి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో శ్రీరంగరాజపురం మండలం పాదలపల్లి వద్ద వారు ప్రయాణిస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న 42 మందికి గాయాలు కావడంతో స్థానికులు వారిని ద్విచక్ర వాహనాలు, కార్లు, వంటి వివిధ వాహనాలలో శ్రీరంగరాజపురం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో పండమ్మ, బుడిగమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. ఇందులో పండమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. అయితే , ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న 45 మందిలో 42 మందికి స్వల్పగాయాలు అయ్యాయని, ఇద్దరికి మాత్రం తీవ్ర గాయాలు కావడంతో వారిని మెరుగైన చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 58,872 మంది స్వామివారిని దర్శించుకోగా 23,523 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.71 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్‌లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

అటవీ చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న డీఎఫ్‌ఓ భరణి, హాజరైన అటవీశాఖ అధికారులు

చిత్తూరు కార్పొరేషన్ : ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా స్థానిక అటవీ ప్రాంతంలో పలు అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. శుక్రవారం నగర వనం ఆవరణలో మొక్కల పెంపకంపై తిరుపతి బయోట్రిమ్ డీఎఫ్‌ఓ నరేంద్రన్ పలు సూచనలు చేశారు. ఎర్ర చందనం చెట్ల ఆవశ్యకత పెరిగే విధానం గురించి తెలిపారు. అలాగే వాటి విత్తనాలను ఎలా సేకరించి నాటాలి, పెంచాలి అనే అంశాల గురించి విపులంగా చెప్పారు. అనంతరం డీఎఫ్‌ఓ భరణి అటవీ ప్రాంతంలో జరిగే పనులకు ఎలా అంచనాలు వేయాలి అనే అంశంపై మాట్లాడారు. పనులు వాటి ప్రతిపాదన, అనుమతి, నిర్మాణాలు, వివరాల నమోదు గురించి ఆమె తెలియజేశారు. అటవీ ప్రాంతం సరిహద్దులు, ఆక్రమణలు నివారణ గురించి మాట్లాడారు. అటవీ చట్టాల గురించి ఫ్లయింగ్‌స్క్వాడ్ డీఎఫ్‌ఓ గురు ప్రభాకర్ తెలిపారు. వన్యప్రాణుల వేట నిందితులను పట్టుకోవడం, సాక్ష్యాల సేకరణ, నిందితులను ఎలా పట్టుకోవాలి.. కేసు నమోదు గురించి తెలియజేశారు. ఏ అంశాలు నాన్ బెయిల్ కింద వస్తాయో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలిపారు. బెయిలబుల్ కేసులు ఏవి, ఏ కేసుకు ఎంత జరిమానా, శిక్ష పడుతుందో విశదీకరించారు. కార్యక్రమంలో శిక్షణ డీఎఫ్‌ఓ సంకేత్‌గౌడ్, ఎఫ్‌ఆర్వోలు థామస్, వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి వర్సిటీలో అంతర్జాతీయ వర్క్‌షాపు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీ వేదికగా శనివారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు రామరంజన్ ముఖర్జీ ఆడిటోరియంలో శాబ్దబోధ మీమాంశ అనే అంశంపై వారం రోజులపాటు అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈ వర్క్‌షాప్‌లో పద్మభూషణ నవలపాకం శతకోప రామానుజతాచార్య రచనలో వివరించిన శాబ్దబోధంపై తత్వశాస్త్ర, భాషా విశ్లేషణ జరగనుంది. దర్శన, వ్యాకరణ విభాగాలలో పరిశోధన విద్యార్థులు, అధ్యాపకులను లక్ష్యంగా చేసుకుని, స్ఫోటవాదం, అభిహితాన్వయ, అన్వితాభిధానవాదం వంటి ముఖ్యమైన అంశాలపై మహాపండితులు చర్చించనున్నారు. ఆసక్తిగల వారు రిజిస్ట్రేషన్‌తో పాటు మరిన్ని వివరాలకోసం ప్రొఫెసర్ సి రంగనాథన్ 94409 19106, డాక్టర్ ఓజీపీ కళ్యాణ శాస్త్రి 88856 73667లను సంప్రదించాలని వర్సిటీ అధికారులు ఒక ప్రకటలో తెలిపారు.

పుత్తూరు రైటర్ వీఆర్‌కు!

– రాజకీయ ఒత్తిళ్లే కారణమా?

పుత్తూరు : స్థానిక పోలీస్ స్టేషన్‌లో రైటర్‌గా పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ బి.రవి తిరుపతి ఎస్పీ ఆదేశాల మేరకు వీఆర్ (వేకన్సీ రిజర్వుడు)కు బదిలీ అయ్యారు. గురువారం జరిగిన ఈ బదిలీ కేవలం స్థానికంగా ఉన్న తెలుగు దేశం పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. పోలీస్ స్టేషన్‌కు వివిధ కేసుల్లో పట్టుకొస్తున్న నిందితులను స్థానిక టీడీపీ నాయకులు వారు మావారే వదిలి పెట్టాలంటూ పోలీసులపై అధికార జులుం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఇలాంటి ఘటనలపైనే ఇలా అయితే మా ఉద్యోగాలు ఎలా చేయాలంటూ రైటర్ రవి ప్రశ్నించడంతో అతనిని టార్గెట్ చేసి వీఆర్‌కు పంపించినట్లు తెలుస్తోంది. చూశారా మేము చెప్పింది చేయకపోతే ఇలానే ఉంటుందంటూ స్థానిక పోలీసు ఉన్నతాధికారులకు టీడీపీ నాయకులు హెచ్చరికలు పంపుతున్నారు. రాజకీయంగా తమ పలుకుబడిని చూపేందుకే చిరుద్యోగిపై ప్రతాపం చూపారంటూ పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది.

500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

కార్వేటినగరం : 5 వందల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి.. వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం కార్వేటినగరం ఎక్సైజ్ శాఖ కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. సారా రహిత ఆంధ్రప్రదేశ్‌గా మార్చే క్రమంలో భాగంగా దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని జంగాలపల్లి సమీపంలోని చిన్న కాలువలో నాటు సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించి, సారా తయారీకి సిద్ధం చేసి ఉంచిన 500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి మూడు డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అలాగే బెల్లం ఊటకు సంబంధించిన చిన్న తయ్యూరు గ్రామం మిల్లన్ కుమారుడు పొన్న ప్రభుపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దాడుల్లో ఎస్‌ఐ సుబ్రమణ్యం, హెడ్ కానిస్టేబుల్ మునిసుందరం, సిబ్బంది పాల్గొన్నారు.

'కళైకావేరి'తో ఎస్వీయూ ఒప్పందం



ఎంఓయూ మార్చుకుంటున్న అధ్యాపకులు

తిరుపతి సిటీ : తమిళనాడులోని తిరుచిరాపల్లెకు చెందిన కళైకావేరి లలిత కళల కళాశాలలో పలు అంశాలపై ఎస్వీయూ కళల ప్రదర్శన అధ్యయన విభాగం శుక్రవారం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు అధ్యాపకులు, విద్యార్థులు పరస్పర అభ్యసన, పరిశోధన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించునే వెసులుబాటు ఉంటుంది. కార్యక్రమలో ఆచార్య శంకర్ గణేష్, ఆచార్య ఉమామహేశ్వరి, డాక్టర్ పత్తిపాటి వివేక్, ఉదయ భాస్కర్ పాల్గొన్నారు.

ఎస్పీడబ్ల్యూలో బయోటెక్ ఫెస్ట్



ఫెస్ట్ ప్రారంభిస్తున్న అతిథులు, ప్రిన్సిపల్

తిరుపతి సిటీ :పద్మావతి డిగ్రీ, పీజీ కళాశాల బయోటెక్నాలజీ విభాగం, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ నారాయణమ్మ అధ్యక్షతన శుక్రవారం బయోటెక్ రెవల్యూషన్ ది నెక్స్ట్ ఫ్రాంటియర్– ట్రాన్స్‌ఫార్మింగ్ సైన్స్ టు సొల్యూషన్ అనే అంశంపై బయోటెక్ ఫెస్ట్ నిర్వహించించారు.ఐజర్ ప్రొఫెసర్ డాక్టర్ శివకుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక సమాజంలో బయోటెక్నాలజీ పాత్ర, ప్రాముఖ్యత, అవకాశాలపై అవగాహన కల్పించారు. అనంతరం బయోటెక్నాలజీ సైన్స్ ఎక్స్‌పో ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ బుడోల్లాస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ బి.విశ్వనాథ్, విభాగాధిపతి డాక్టర్ భువనేశ్వరి, డాక్టర్ భద్రమణి, అధ్యాపకులు హేమలత, కుసుమ పాల్గొన్నారు.

కిక్కిరిసిన 'సదరం'



సదరం శిబిరానికి హాజరైన దివ్యాంగులు

కుప్పం : కుప్పం వంద పడకల ఆస్పత్రిలో దివ్యాంగుల కోసం శుక్రవారం నిర్వహించిన సదరం శిబిరానికి విశేష స్పందన వచ్చినట్లు కడా పీడీ వికాస్ మరమ్మత్ తెలిపారు. గుడుపల్లి, రామకుప్పం, శాంతిపురం మండలాలకు చెందిన దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లు పరిశీలన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా 2,247 మంది దివ్యాంగులు హాజరై చికిత్సలు చేసుకున్నారు. వీరిలో 1407 మంది దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

నేడు మున్సిపాలిటీ, రూరల్ ఏరియాలో శిబిరం

శనివారం కుప్పం మున్సిపాలిటీ, కుప్పం రూరల్ పరిధిలోని దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్‌ల పరిశీలన నిర్వహిస్తున్నట్లు పీడీ తెలిపారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిరుధాన్యాలతో ఆరోగ్య రక్షణ



మహిళలకు కిట్‌లు అందిస్తున్న సుమతి, కలీముల్లా

తిరుపతి సిటీ : ఆరోగ్య రక్షణలో చిరుధాన్యాలు కీలకపాత్రం పోషిస్తాయని ఆర్ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.కలీముల్లా తెలిపారు. శుక్రవారం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో 'చిరుధాన్యాలపై అవగాహన, ప్రాసెసింగ్ యంత్రాల సందర్శన' అనే అంశంపై 25 మంది ఎస్సీ మహిళలకు శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలు తీసుకుంటే శరీరానికి పోషకాలు పుష్కలంగా అందుతాయని చెప్పారు. అనంతరం చిరుధాన్యాలను శుద్ధి చేయడం, పొట్టు తీయడం, తినుబండారాల తయారీపై మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఏడీఆర్ డాక్టర్ వి.సుమతి మాట్లాడుతూ చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే రక్తపోటు, చక్కెర వ్యాధి, అధిక కొవ్వును అరికట్టవచ్చని వెల్లడించారు. అనంతరం మహిళలకు కిట్, సర్టిఫికెట్లతో పాటు తినుబండారాలను పంపిణీ చేశారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే దోమలు రావని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ పేర్కొన్నారు. చిత్తూరు నగరం మాపాక్షిలో శుక్రవారం ఫ్రైడే డ్రైడేను నిర్వహించారు. ఆయన ఈ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాపాక్షిలోని కొన్ని వీధులను పరిశీలించి ప్రజలకు పలు సూచనలు చేశారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. దోమల వ్యాప్తితో వచ్చే వ్యాధులను గుర్తు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది రామకృష్ణ, నారాయణ ఉన్నారు.